


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు



'అందరి బంధువయా'

'మధుమాసం' చిత్రానికి నంది బహుమతి అందుకుంటున్న మన రచయిత్రి రమణిగారు. క్రిందటి నెలే విడుదలై, అందరి మన్ననలనూ అందుకున్న 'అందరి బంధువయా' సినిమాకి కథ, మాటలూ అందించారు. మానవత్వపు పరిమళాలను పంచిపెట్టిన ఈ చిత్రం రమణి గారికి మరిన్ని బహుమతుల్ని తెచ్చి పెట్టాలని మనసారా ఆశిస్తూ - 'కౌముది'

'పక్షికింత ధాన్యం.. పశువు కింత గ్రాసం, మనిషికింత సాయం. ఇవే నాకు తెలిసిన పూజలు' అని నమ్మిన హనుమంతరావు తన కొడుక్కి వారసత్వంగా కొంత సంపద ఇచ్చాడు. ఆ సంపద పంచుకుంటే పెరిగేదే కానీ తరిగేది కాదు! నందూకి వాళ్ళ నాన్న ఇచ్చిన ఆస్తి పరోపకార గుణం! ఇటువంటి నందూకి ఎన్నో ఆర్థిక ఇబ్బందుల మధ్యనున్నప్పుడు వందల కోట్ల ఆస్తి వస్తే ఏం చేసాడూ? వారసత్వం అంటే ఏవిటీ? ఓ మనిషి సుఖంగా బ్రతకడాని ఏం కావాలీ? ఓ మనిషి జీవితంలో గెలవడానికి ఏం కావాలీ? - అని చెప్పే పాత్ర నందూది.

'నేనూ. నా కుటుంబం' అనే పరిధిలో తను తిన్నా తినకపోయినా, తన కుటుంబం కోసం అక్క పెళ్ళి కోసం పిసినారి తనంతో పైసా పైసా కూడపెట్టే 'పద్దూ'కి హనుమంతరావు పాత్ర తారసపడితే ఆమె జీవితంలో ఏం మార్పులు వచ్చాయీ? అన్నది చెప్పే కథ ఇది.

గుండె తాకట్టు పెట్టడం కథలో మలుపు.

"నాకు మనుషుల మీద నమ్మకం...

మానవత్వం మీద విశ్వాసం.." అనే చోట ఎండ్ టైటిల్స్ పడతాయి. కానీ ఈ రెండు వాక్యాలూ నేను సినిమాకి కథ వ్రాసేటప్పుడు మొదట రాసుకుని మొదలు పెట్టాను.

'మనిషి మీద నమ్మకం.. మానవత్వం మీద విశ్వాసం'.. మొదటా, మధ్యలో, చివరా కనిపించే సినిమా మా 'అందరి బంధువయా'.

అంతిమ వాక్యం రాసేటప్పుడు నుదుట శ్వేత బిందువూ, మనసులో అమృత బిందువూ ఆవిర్భవించే రచనలు జీవితంలో అతి స్వల్పంగా చేసే సందర్భాలు దొరుకుతాయి.

నా జీవితంలో ఓ మంచి సినిమా వ్రాసే అదృష్టం మా దర్శకుడు 'చంద్రసిద్దార్ధ' వల్ల కలిగింది

'మధుమాసం' షూటింగ్ జరిగే రోజుల్లో నేను చందూకి ఈ కథ చెప్పాను. "ముందే ఎందుకు చెప్పలేదూ? అదే చేసేవాడినిగా" అన్నాడు.

ఆ తర్వాత ఇద్దరం ఓ సంవత్సరమో, ఇంకా ఎక్కువ కాలమో వేరే పనుల్లో గడిపాం. తను వేరే కథలు వింటూ సడెన్‌గా నాకోనాడు ఈ కథ గురించి గుర్తు చేసాడు. నేనేం వెంటనే స్పందించలేదు! ఎందుకంటే 'మంచి' గురించి మాట్లాడటం... చెప్పడం... చూపించడం చేతులు కాల్చుకోవడమే అవుతుందని నా నమ్మకం. కానీ అతను 'సిద్దార్ధుడు'! ఒకంతట పట్టు విడవలేదు!

అప్పటిదాకా చందమామ కథలాగా ఉన్న సినిమా కథలో పాత్రౌచిత్యాలూ, హాస్యం, ప్రేమా, విషాదం, విరాగం, ధైర్యం ప్రతిబింబించే సంఘటనలతో స్క్రిప్ట్ వర్క్ చకచకా ముందుకి సాగిపోయింది.

"ఈ సారి 'ఆ నలుగురు'లా భారంగా కాదు.. హాస్యరసం ప్రధానంగా ఫిలాసఫీని ఆవిష్కరిదాం.." అన్నాడు చందూ.

మేం ఇద్దరం గట్టిగా 'ఐదు' రోజులు కూర్చుని సీనిక్ ఆర్డర్ వేసాం.

నేను ఓ పదిహేను రోజులో డైలాగ్ వర్షన్ పూర్తి చేసాను.

డైలాగ్స్ వ్రాయడం నాకు మొదటిసారి!

ఎంతో సీరియస్‌గా హాస్యం వ్రాసాను.

ఈ కథ తెరకి ఎక్కక ముందే కథ తెలిసినవాళ్ళు మా అబ్బాయిలు అశ్విన్, కృష్ణకాంత్‌లూ, ఇంకొకరు నా స్నేహితురాలు శ్రీమతి కాంతి కిరణ్, కౌముది కో ఎడిటర్!

అందరం ఉద్విగ్నంగా తెరమీద చూడటానికి ఎదురు చూసాం.

మొదటిసారి టెక్నీషియన్స్ మంతా కలిసి కూర్చుని చూసాం. సినిమా మొత్తం నాతో వచ్చిన ఇద్దరు ఫ్రెండ్స్ నవ్వుతూనే ఉన్నారు. మధ్యలో కళ్ళు తుడుచుకుంటున్నారు.. సినిమా అయింది. ఎవరూ ఒక నిమిషం మాట్లాడలేదు... ఆ తరువాత క్లాప్స్ కొడుతూ అంతా బలంగా నిట్టూర్చారు!

చందూని అతని మిత్రులూ, మిగతా టెక్నీషియన్స్ కౌగలించుకుని అభినందిస్తున్నారు.

కానీ అతని కళ్ళల్లో టెన్షన్! నా వైపే చూస్తున్నాడు. నేను ఓ పక్కగా నిలబడ్డాను.

అందరినీ తప్పించుకుని నా దగ్గరకి వచ్చి నిలబడ్డాడు.

నేను అతని చెయ్యి పట్టుకుని 'నా కథని ఇంత బాగా తీస్తారని ఊహించలేదు' అన్నాను

అప్పుడు తేలిగ్గా ఊపిరి పీల్చి "చాలు! ఈ మాట!" అన్నాడు.

ఇలా కథా రచయితకి ఇంత ప్రాముఖ్యం ఇచ్చి వారి అభిప్రాయాలకి విలువనిచ్చే దర్శకులు ఈ తరంలోనూ ఉన్నారు!

ఇంక మా స్పందనలు పక్కన పెడితే, రిలీజ్‌కి ఒక రోజు ముందే 'సినీగోయర్ డాట్ కామ్'లో, 'గ్రేట్ ఆంధ్రా డాట్ కాం'లో 'మానవత్వానికి నిర్వచనం' అనేలాంటి రివ్యూలొచ్చాయి.

సునీతా చౌదరి వ్రాసింది **'సినిమా చూసి బయటకి వస్తుంటే, ఎదురొచ్చిన ప్రతి వ్యక్తినీ ప్రేమగా పలకరించాలనిపిస్తుంది... అడ్డొచ్చిన జంతువు పట్ల కూడా ప్రేమగా ఉండాలనిపిస్తుంది'** అని.

సిరాశ్రీ నాకు మెయిల్ ఇచ్చారు. **'మనసుతో చూసాను... రాయిని కూడా కరిగించే కథ రాసారు.. మానవత్వానికి గుడి కట్టారు'** అని.

కాలిఫోర్నియా నుండి నైట్ షో చూసి రాగానే వెంటనే నాకు కాల్ చేసి కిరణ్‌ప్రభగారూ, కాంతీ అభినందించారు. కాంతి మనస్ఫూర్తిగా ఎక్కువ సంతోషించిన వ్యక్తి. కథ విన్ననాటి నుండే ఇది గొప్ప సినిమా అవుతుందని నమ్మిన ప్రేక్షకురాలు. సినిమా చూసాక ఆమె స్పందనకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. 'మీరు చెప్పినట్లే ఉంది' అంది.

సినిమా చూసి తాటిపాముల మృత్యుంజయుడూ, తోటకూర ప్రసాద్ గారు, డొక్కా ఫణీ, ఇంకా చాలా మంది అమెరికా నుండి ఫోన్ చేసి 'మాటలు ఆణిముత్యాలు.. ఎంతో మంచి సినిమా చూసాం' అన్నారు. లేక పోతే మా 'కౌముది' పాఠకులు 'ఇన్ని కబుర్లూ మాకేనా? సినిమాలో రాయలేవా?' అనేసేవారు!

ప్రముఖ సినీరచయిత సత్యానంద్ గారు, కైకాల నాగేశ్వరరావుగారనే ప్రొడ్యూసర్‌తో (మన సినీనటులు సత్యనారాయణగారి సోదరులు) కలిసి వెళ్ళారు. ఆయన ఇంటికి వచ్చాక నాగేశ్వరరావుగారు ఫోన్ చేసి ఓ సంఘటన చెప్పారట "ఇందాక రోడ్ మీద సిగ్నల్స్ దగ్గర ఓ చేతులు లేని ముష్టి వాడు అడుక్కోవడానికి వచ్చాడు. నేను పర్స్ తీసేలోపే అతను లేడు.. ఏమయాడా అని చూస్తే, ఓ స్కూటరిస్ట్ ఏక్సిడెంట్‌లో పడిపోతే అటు పరిగెత్తాడు... మొదట పరిగెత్తాడు, మనిషి పడిపోతుంటే సాయం అందించడానికి.. తరువాత గుర్తుకొచ్చి ఉంటుంది తనకి చేతులు లేవని.. ఈ ఇన్సిడెంట్ చూస్తే ఇందాక మనం చూసిన 'అందరి బంధువయా' గుర్తొచ్చింది. మంచి సినిమా" అన్నారట. డైరెక్టర్ శివనాగేశ్వరరావు కూడా "I am proud of you Ramani"అన్నాడు. మూవీమొగల్ మా డా.డి.రామానాయుడుగారు ఒక్కరే టిక్కెట్ కొనుక్కుని 'సినీమాక్స్'లో సినిమాకి వెళ్ళారు. ఒంటిగంట దాటితే ఆయన ఆకలికి ఉండలేరు. నాకు మొదటే చెప్పారు "ఇంటర్వెల్‌లో వచ్చేస్తా" అని. కానీ మొత్తం చూసారు. "చివరిదాకా కూర్చోపెట్టారు! అన్నం తినకుండా... దగ్గొచ్చేట్లు రెండుసార్లు నవ్వాను" అన్నారు. అది అతిగొప్ప కాంప్లిమెంట్ మాకు. అల్లు అరవింద్ గారు "మీకు మళ్ళీ అవార్డు ఖాయం" అన్నారు చూడగానే.

ఒకావిడ మాత్రం లింగాపూర్నుండి ఫోన్ చేసి ఏడుస్తూనే ఉంది. "నాకు ఏడుపొచ్చేస్తోంది... అంత మంచి సినిమా రాసారు." అంది. అది దుఃఖం కాదు.. ఆనందం!!

కాకినాడ నుండి డా.దివాకర్ గారు అనే డాక్టర్ గారు వీరేంద్రనాథ్ గారిని "ఆ రైటర్ తెలిస్తే ఒక్కసారి మాట్లాడాలని ఉంది"అని మరీ అడిగి నాతో పదినిమిషాల సేపు సినిమాలోని ప్రతి సన్నివేశం గురించి ఎంతో ఆర్ద్రతతో మాట్లాడారు.

మా గురువుగారు వీరేంద్రనాథ్ గారు "ఎంతో మంది చెపుతున్నారు. మళ్ళీ నంది అనుకుంటా" అన్నారు. అంతే కాదు "మీ సినిమా చూసిన ఒకాయన అర్జెంటుగా మాట్లాడాలంటున్నాడు" అని అగస్త్యశాస్త్రిగారికి ఫోన్ ఇచ్చారు. ఆయన సినిమా చాలా బావుందని ప్రశంసించి "మంచి సినిమాకి డబ్బులొస్తున్నాయా? ఇది జనానికి నచ్చిందా?" అని అడిగారు.

ఇక్కడ కాసేపు ఆగుదాం.. మనలో చాలామంది.. "మంచి సినిమాలు రావడం లేదండీ.. హాయిగా సినిమాకి వెళితే... రక్తపాతాలూ... టాటా సుమోలు గాల్లోకి లేవడం.. ఏడుపులూ, నరుక్కోవడాలూ చూడలేకపోతున్నాం.." అంటారు. వీలైనప్పుడల్లా వాటిని విమర్శిస్తారు. కానీ చూస్తారు! అందుకే విమర్శించగలరు... నిజంగా ఆ సినిమాలు వాళ్ళకి నచ్చడం లేదా? హిపోక్రసీ, ఆత్మవంచన!

మనం చెయ్యలేని పనులు హీరో గంటలపాటు చేస్తే ఒళ్ళు మరిచి చూడగలిగేది డబ్బులు సంపాదించి పెడుతుంది! మంచి సినిమా, చెడు సినిమా అనిలేవు! ప్రేక్షకులకి నచ్చే సినిమా అవ్వాలి. ముఖ్యంగా అందులో 'స్టార్స్' ఉండాలి. కొన్ని కోట్ల బడ్జెట్ ఉండాలి. సెట్లు వేసి పడగొట్టాలి. వీటికి థియేటర్లు ఉంటాయి. ఇవి వందరోజులు ఆడతాయి. తప్పులేదు! టేస్ట్స్ డిఫర్.. మా చిన్నతనంలో కొవ్వలి పుస్తకాలూ, కొమ్మూరి సాంబశివరావుగారి పుస్తకాలూ, చలంగారివీ, విశ్వనాథ గారివీ చదివేవాళ్ళు కోకొల్లలుగా ఉండేవాళ్ళు! ఒక్కొక్కరిది ఒక్కో బాణీ!

అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కమర్షియల్ సినిమాల్లో ఐటం సాంగులూ, ఫైట్లూ, భారీ బడ్జెట్లూ తప్పవు!

కానీ నేను చెప్పేది 'మంచి కథలూ, సోషల్ ఎవేర్ నెస్‌తో సమాజానికి మంచి చేసే సినిమాలూ' రావడం లేదని వాపోయే వాళ్ళ గురించి... అలాంటి వాళ్ళు కబుర్లు చెప్పడానికే గానీ, నిజంగా మంచి సినిమా వస్తే థియేటర్‌కి వెళ్ళి చూస్తే 'ఆ నలుగురు' లాంటి సినిమాకి అంత స్లో పికప్ ఎందుకూ? అందరి బంధువయా గురించి 'నెట్'లో పత్రికల్లో, చూసినవాళ్ళూ ఇంత బాగా చెపుతున్నా ఎందుకు వెంటనే వెళ్ళి చూడరూ? పక్కరాష్ట్రాల్లో నుండి దిగుమతి అయినవీ, పరాయి దేశాల్లో నుండి డబ్ అయి వచ్చినవీ స్టాటస్ సింబల్‌గా వెంటనే వెళ్ళి చూడడంలేదా?

అమీర్ ఖాన్ లేకుండా 'తారే జమీన్ పర్', అమితాబ్, అభిషేక్ లేకుండా 'పా', చూస్తారా అంటే ప్రశ్నే!

అవతార్ తీసిన జాన్ కేమరాన్ ఒక ఊహా జనితమైన ప్రపంచాన్ని నిర్మించి విచిత్రమైన మనుషుల్ని, జంతువుల్ని డిజైన్ చేసి చూపిస్తే అది వాస్తవమని నమ్మి దానిని ఆదరించిన మన ప్రేక్షకులు మనుషుల్లో మానవత్వం మంచితనం గురించి ఒక సినిమా తీస్తే మనుషుల్లో ఇంత మంచివాళ్ళుంటారా అని సందేహాన్ని వెలిబుచ్చుతున్నారు. ఒక అసాధారణాన్ని నమ్మేసిన మనవాళ్ళు మంచితనాన్ని మాత్రం ఒక సాధారణ విషయంగా నమ్మటానికి ఎన్ని శతాబ్దాలు పడుతుందో?

ఇంత ఎందుకూ? మా అక్కలూ, పిన్నులూ, అత్తలూ, బాబాయ్ లు కూడా 'నెమ్మదిగా వెళతామే' అన్నారు. వీళ్ళు అందరూ 'బావుందట' అని టాక్ విని నెమ్మదిగా వెళ్ళేవరకూ చిన్న సినిమాలు ఎంత మంచివైనా థియేటర్లో ఉంటాయా?

ఓ మంచి ప్రయత్నం చేసి 'ప్రేమ' తర్వాత 'సేవ' అనేది అత్యంత మనోహరమైనది' అని ప్రభోదించిన చిత్రం ఈ 'అందరి బంధువయా'. ఎక్కడా అలా అని మెసేజ్‌లూ, ఉపన్యాసాలూ, అతి పొడవైన సంభాషణలూ ఉండవు. 'హీరో అవ్వాలంటే విలన్ అతి క్రూరుడై ఉండాల'న్న ఫార్ములాకి ఎదురీది హీరోయిజాన్ని పాజిటివ్ కేరక్టర్స్ మధ్య చూపించిన చిత్రం! 'ఐ లవ్ యూ' అనే మాట లేకుండా ఒక అమ్మాయి, అబ్బాయి తమ ప్రేమని వ్యక్తీకరించుకున్న చిత్రం. "నీ దగ్గర కూర్చుని కాసేపు ఏడవవచ్చా?" అని అతను తనకి ఎంత దగ్గర వాడో చెపుతుంది హీరోతో హీరోయిన్. "అప్పు తీసుకున్న వాడికి మనమీదే కాదు, మన అభిమానం మీద కూడా హక్కు లొస్తాయి.. అందుకే మా నాన్న ఆత్మహత్య చేసుకున్నారు" అంటుంది.

"ఈ రోజుల్లో చావూ కాస్ట్లీనే.." అని చెపుతుంది.

"రమణగాడి కోసం అరటి తోట అమ్మేసావా... పోన్లే మన రమణగాడేగా.. ఇంతకీ ఈ రమణగాడు ఎవరు నాన్నా?" అనే హీరో కారెక్టరైజేషన్.

"మా చేనేతల బతుకుల సంగతి ఆ నేతలకి పట్టకపోయినా మా హనుమంతన్నయ్య ఉన్నాడుగా" అంటారు ఊరివాళ్ళు.

"ఈ ఊరి నుండి నేను ఎంతో తీసుకు వెళుతున్నాను... అవి పంచుకుంటే తరిగేవి కావు" అంటుంది హీరోయిన్.

ఆ ఊరు.. పోచంపల్లి అని హైద్రాబాద్ సమీపంలో, రామోజీ ఫిల్మ్ సిటీకి అరగంట దూరంలో ఉంది! వాళ్ళ ఇళ్ళకి తాళాలు పెట్టరు. అన్ని పట్టు చీరలతో, సొమ్ములతో ఉన్న ఇళ్ళు మాకు షూటింగ్ నిమిత్తం ఇచ్చేసి పనులకి వెళ్ళిపోయారు. అంతేకాకుండా విందులు కూడా చేసారు. అంత మంచి 'చేనేత చీరలు' నేసే 'అంత మంచి ఊరు' చూడాలంటే మా సినిమా చూడాలి!

ఇది కోనసీమా? అన్నట్లుగా తీసాడు మా కెమేరామెన్ జయకృష్ణ గుమ్మడి. ఇతనికి మా సినిమా చేస్తుండగానే నేషనల్ అవార్డు వచ్చింది.

అమెరికా బావగా ,'గొడుగు కూడా కొనుక్కోని పద్దూ పిసినారితనం ఎంత పని చేసింది' అని ఆర్యన్ నవ్వుల పండించిన సీన్‌కీ, మొత్తం సినిమాకి రూబెన్స్ రీరికార్డింగ్ అదర గొట్టారు. ఆణిముత్యాల్లాంటి పాటలు అందించారు.

'సూర్యుడు ఎవరయ్యా... మన అందరి బంధువయా. చంద్రుడు ఎవరయ్యా.' అంటూ చైతన్య ప్రసాద్ ఈ ఏటి ఉత్తమ గీతం రాసేసారు! పాటలన్నీ మంచి సాహిత్యంతో ఇచ్చి సినిమాకి ప్రాణం పోసారు. కథే నాయికా నాయికులు శరీరం! దర్శకుడు ప్రాణం!

మా సినిమా 'అందమైన మంచి మనిషి'!

మా దర్శకుడు మనసుతో తీసాడు. అద్భుతమైన మానవత్వ కోణాలు ఆవిష్కరించాడు.

శర్వానంద్ ప్రతిపాత్రా వెరైటీగా ఎంచుకునే మచి నటుడు. ఎంతో ఈజ్‌తో అద్భుతంగా నటించాడు. పద్మప్రియ ఒకప్పుడు 'మిస్ ఆంధ్రా', తమిళ, మలయాళ భాషలో స్టేట్ అవార్డు అందుకుంది చక్కని నటన ప్రదర్శించింది.

నరేష్ హనుమంతరావుగారిగా ఎప్పటికీ మీ మనసుల్లో నిలిచివుంటారు. ఆ ఊళ్ళో చిన్నపిల్లాడు కూడా ఆయన్ని చూసి భయపడడు... కానీ ఊరంతా ప్రేమిస్తారు! అటువంటి భావాలు దృశ్యీకరించడం కత్తి మీద సామే అయింది.

కృష్ణభగవాన్ తన శైలిలో చక్కిలిగింతలు పెట్టాడు.

విజయ్ సాయి సినిమా మొత్తం తన టైమింగ్‌తో నవ్వులు పండించాడు. అతని తండ్రిగా మా కాస్ట్యూమ్స్ జగదీష్ నటించాడు.

ఇతను సీమశాస్త్రి ప్రొడ్యూసర్ కూడా! ఉన్నంతసేపూ నవ్వించాడు. ఊళ్ళో కుక్క మొరిగినట్లు మాట్లాడే నటుడు ఉన్న ఒక్క నిమిషమైనా అద్భుతంగా నటించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఆయన పేరు రాజేష్. 'ఇంకా నయం! బావ రాగానే నేను ఎదురెళ్ళలేదు.. నన్ను చేసుకుంటాననేవాడు' అనే ముదుర టెంక మాటలు మాట్లాడిన చిన్న చెల్లి ప్రియాంకా, అమెరికా బావకోసం రేపిడెక్స్ ఇంగ్లీష్ కోర్స్ చదివే అక్కగా హరితేజ అమాయకమైన అమ్మగా ప్రగతీ... ఊళ్ళో హైటెక్ మావయ్య సి.వి. ఎల్ తండ్రిగా ఆనంద్... సూర్య, జీవా... ఇంక లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అన్నట్లు కీలకమైన విలన్ పాత్ర హైదరాబాద్ నవాబ్ మా ఆర్.కే. అంతా ఆ పాత్రలకోసమే పుట్టినట్లు కుదిరారు.

ఇవన్నీ మనకి కనిపించే పాత్రలు.

కనిపించని ముఖ్యమైన పాత్రలు మా ప్రొడ్యూసర్లు నయీమ్, ఆర్.కే, ఇనగడప సతీష్‌లు. ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు!

నయీమ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఈ రథాన్ని ముందుకి తోలుకెళ్ళి గమ్యం చేర్చాడు!

గోగూ కోడైరెక్టర్ గా పడాల్సినంత హడావిడి పడుతూ కూడా చిరునవు వదిలి పెట్టేవాడు కాదు!

మా అసోసియేట్ కుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలి. నా డైలాగులతో బాటు పారలల్ గా తనూ ప్రతి సన్నివేశానికీ డైలాగులు రాసాడు. చందూగారిని ఎలాగైనా మెప్పించాలని పట్టుదలతో ఉండేవాడు. "రాంబాబూ మంచి కుర్రాడేనండీ.. బాత్ రూములో లైట్ పెట్టించాడు మన అమ్మాయిలు స్నానం చేస్తుంటే ఇబ్బంది అనకూడదనీ" అనే డైలాగ్ అతని కాంట్రిబ్యూషనే. ఎప్పటికైనా మంచి కామెడీ రైటర్ అవుతాడు. ఇంకా అసోసియేట్ డైరెక్టర్స్ గణేష్, బాలూ, మా అందరి మధ్యా సెట్ లో స్ప్రింగ్‌లా ఊగుతూ సినిమాలో కృష్ణభగవాన్ పక్కన ఉలిపిరికాయతో కనపడిన కృష్ణనాయక్, ప్రతి రోజూ మాకు కావలసినవి చూసిన వెంకట్, మా సినిమా తనే తీసినంత సంబరపడిన మా డ్రైవర్ కుమార్.. ఇలా ప్రతి ఒక్కరూ 'అందరి బంధువులే' అయి ఈ సినిమా తెరకి ఎక్కించారు.

మనసున్న ప్రతివాళ్ళూ మంచి సినిమా అన్నారు.

మా చంద్ర సిద్దార్థ్ ని 'శ్యాం బెనగల్' గారితో పోల్చారు.

కథాబలం ప్రతి సన్నివేశంలో ఉందన్నారు.

'It's a Chandra Siddarths Movie' అని గర్వంగా రాసుకోగలిగిన సినిమా!

'అందరి బంధువయా'కి కథ, మాటలు నేనే రాసాను అని నేను తృప్తిగా ఫీలవగలిగిన సినిమా.

**'వెళుతున్నప్పుడు మానవత్వపు విత్తనాలు జల్లుకుంటూ వెళితే వచ్చేటప్పుడు తియ్యని ఫలాలనిస్తాయి' అని 'కౌముది' కాలంలో పుట్టిన సినిమా.**